## క్లుప్తంగా

### ఉత్తమ వైద్యులకు సన్మానం



వైద్యులను సన్మానిస్తున్న కలెక్టర్ గిరీషా పీఎస్

పుల్లంపేట : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఇంటి వద్దకే వైద్యంలో భాగంగా సేవలందించిన పుల్లంపేట వైద్యులు మనోజ్ చంద్ర, సానేశేఖర్, స్వాతి ప్రియాంక, శ్వేతలను కలెక్టర్ గిరీషా పీఎస్ ఘనంగా సన్మానించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వైద్య సేవలు అందించినందుకు వారిని సన్మానించినట్టు కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి డాక్టర్ కొండయ్య, జిల్లా నోడల్ ఆఫీసర్ లక్ష్మి, జిల్లా కో–ఆర్డినేటర్ ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### విద్యార్థులకు దుస్తుల పంపిణీ



విద్యార్థులకు దుస్తులను పంపిణీ చేసిన అయ్యప్ప సేవా సొసైటీ సభ్యులు

రాయచోటి టౌన్ : పేద విద్యార్థులకు అయ్యప్ప సేవా సొసైటీ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. సోమవారం రాయచోటి రూరల్ పరిధిలోని మాధవరం ప్రాథమిక పాఠశాలలో సంక్రాంతి పండుగ పురస్కరించుకొని విద్యార్థులకు బట్టలను పంపిణీ చేస్తున్నట్లు సొసైటీ అధ్యక్షుడు బసిరెడ్డి తెలిపారు. సంక్రాంతిని అందరూ జరుపుకోవాలని ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నాగముని రెడ్డి, ఉర్దూ పాఠశాల హెచ్‌ఎం రహంతుల్లా, ఉపాధ్యాయులు పొట్టిరెడ్డి, శివారెడ్డి, మనోహర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### ఆధ్యాత్మికవేత్త ప్రభాకర్ రావు మృతి



పుల్లంపేట : ఆధ్యాత్మికవేత్త, ఉపాధ్యాయుడు, ధర్మ ప్రచారకుడు ప్రభాకర్ రావు(75) మండల పరిధిలోని వత్తలూరు పంచాయతీలోని అగ్రహారం గ్రామంలో మృతి చెందాడు. ఈయన వత్తలూరు పంచాయతీలో ఉపాధ్యాయుడిగా పనిచేసి పదవీ విరమణ పొందారు. 2000వ సంవత్సరంలో 18వ పర్యాయం అయ్యప్పస్వామి దీక్ష చేపట్టి రాయలసీమ జిల్లాలో మొట్టమొదటి సారిగా రాజంపేట నుంచి శబరిమలకు పెద్దఎత్తున అయ్యప్ప స్వాములతో కలిసి 41 రోజులు పాదయాత్ర చేసి స్వామివారిని దర్శించుకుని అయ్యప్ప మాలదారులకు ఆదర్శంగా నిలిచారు. ప్రభాకర్ రావు మృతిపట్ల రాజంపేట తాలుకా ఎన్జీఓ సంఘం అధ్యక్షుడు వెంకటరమణ తమ సంతాపాన్ని తెలియజేశారు.

### అర్జీదారులకు అన్నదానం



భోజనం వడ్డిస్తున్న దృశ్యం

రాయచోటి టౌన్ : కలెక్టరేట్ కార్యాలయం ఎదుట అర్జీలు ఇవ్వడానికి వచ్చే అర్జీదారులకు ఉచితంగా భోజనం అందించారు. సోమవారం ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో రామాపురం మండల స్టోన్ క్రషర్స్ సౌజన్యంతో అన్నదానం ఏర్పాటు చేశారు. లక్కిరెడ్డిపల్లె మార్కెట్ కమిటీ చైర్మన్ కర్ణపు విశ్వనాథరెడ్డి, స్టోన్ క్రషర్స్ యజమానులు పాల్గొన్నారు.

### వైద్య శిబిరానికి స్పందన



వైద్యపరీక్షలు చేస్తున్న దృశ్యం

సంబేపల్లె : మండల పరిధిలోని గుట్టపల్లె పంచాయతీలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం మంచి స్పందన లభించింది. ఏపీ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ వారి ఆదేశాల మేరకు చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీం ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. 118 మంది రోగులకు దేవపట్ల వైద్యాధికారి డా.ముస్తాక్ అహమ్మద్ పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈఓ కరీముల్లా, సచివాలయ ఉద్యోగులు, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు, లింక్ వర్కర్ స్కీం సభ్యులు పాల్గొన్నారు.

### చేప పిల్లల విడుదల



విడుదల చేస్తున్న అధికారులు, నాయకులు

గాలివీడు : వైఎస్సార్ వెలిగల్లు ప్రాజెక్టులో మత్స్య శాఖ అధికారులు, మండల వైస్ ఎంపీపీ యదుభూషన్ రెడ్డి, జెడ్పీటీసీ ఖాదర్ మొహిద్దీన్, వెలిగల్లు సర్పంచ్ బాబా ఫక్రుద్దీన్ చేతుల మీదుగా 4 లక్షల చేప పిల్లలను సోమవారం విడుదల చేశారు. కార్యక్రమంలో మత్స్యశాఖ అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

# సంక్షేమ పథకాల రారాజు సీఎం జగన్

- అర్హతే ఆధారంగా ఇంటింటా లబ్ధి
- గడప గడపకు మన ప్రభుత్వంలో పాల్గొన్న ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి



లక్కిరెడ్డిపల్లె: పథకాల లబ్ధిని వృద్ధురాలికి వివరిస్తున్న ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి

లక్కిరెడ్డిపల్లె : అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందించే సంక్షేమ సారథి, పథకాల రారాజు ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి పేరొందారని అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి కొనియాడారు. సోమవారం లక్కిరెడ్డిపల్లె మండలం దప్పేపల్లె గ్రామంలో మేడి మాకుల గుంత ఎస్సీ కాలనీ, కొత్తపల్లె, తురకపల్లె, రెడ్డివారిపల్లె, కొవ్వూరు వాండ్లపల్లె, డి.రామాపురం, గల్లావాండ్లపల్లె, వేములవాండ్లపల్లె, గొల్లపల్లె, జాండ్రపల్లెలలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న పాలనలో ప్రతి ఇంటికీ సంక్షేమ లబ్ధి అందుతోందన్నారు. ఆదర్శంగా, పారదర్శంగా జగనన్న పాలన సాగుతోందన్నారు. గ్రామాల్లోని ప్రతి గడపన ఎమ్మెల్యేకి ఘనస్వాగతాలు లభించాయి.

**సమస్యల పరిష్కారం..**

మేడామాకాకుల గుంత కొత్తపల్లెకు చెందిన ఆరేం లక్ష్మీదేవి అనే దివ్యాంగురాలు పెన్షన్ మంజూరు చేయాలని ఎమ్మెల్యేని అభ్యర్థించగా ఎమ్మెల్యే మంజూరుకు దరఖాస్తు చేయించాలని అధికారులను ఆదేశించారు. ఎం.కొత్తపల్లె, రెడ్డివారిపల్లె, తురకపల్లె, ఎస్సీ కాలనీవాసులు తమకు సెల్ టవర్ లేక నెట్‌వర్క్ రావడం లేదని, సెల్ టవర్‌ను ఏర్పాటు చేయాలని కోరగా ఆయన సానుకూలంగా స్పందించారు. డి రామాపురంకు చెందిన నరేష్ అనే దివ్యాంగుడు పెన్షన్ మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశాడు. ఎస్సీ కాలనీలలో సిమెంట్ రోడ్డుపై అడ్డంగా ఉన్న విద్యుత్ స్థంభాలను వెంటనే తొలగించాలని, గ్రామస్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలని ట్రాన్స్‌కో సిబ్బందికి ఎమ్మెల్యే సూచించారు. గల్లావాండ్లపల్లెలో అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించి పిల్లలకు అందుతున్న విద్యా సౌకర్యాలు, పౌష్టిక ఆహారంపై ఆరా తీశారు. గల్లావాండ్లపల్లెలో నివాసాలపై వెళ్తున్న 11కేవీ విద్యుత్ లైన్‌ను తొలగించి ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని అధికారులకు ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి ఆదేశించారు. దప్పేపల్లెలోని ఆంజనేయస్వామి ఆలయానికి వాటర్ షెడ్‌ను ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో లక్కిరెడ్డిపల్లె ఎంపీపీ మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి, జెడ్పీటీసీ రమాదేవి, మాజీ ఎంపీపీ రెడ్డయ్య, మార్కెట్ యార్డు చైర్మన్ విశ్వనాథ రెడ్డి, రవిరాజు, ఉప మండల అధ్యక్షుడు సమరసింహారెడ్డి, నరసింహారెడ్డి, తహసీల్దార్ నాగ ప్రసన్న లక్ష్మి, ఎంపీడీఓ వెంకటరమణారెడ్డి, ఏపీ ఎస్పీడీసీఎల్ ఏఈ కిషోర్, ఉద్యానశాఖ అధికారిణి నాగమణి తదితరులు పాల్గొన్నారు.

**పల్లెపల్లెను కలుపుతూ రహదారులు నిర్మిస్తాం**

నియోజకవర్గంలోని పల్లెపల్లెను కలుపుతూ రహదారులు నిర్మిస్తామని ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని కోనంపేట గాలివీడు రోడ్డు నుంచి దప్పేపల్లె, గొల్లపల్లె వరకు రూ. 1.26 కోట్ల ఏఐఐబీ నిధులతో నిర్మించిన సీసీ రోడ్డు ప్రారంభంలో ఎంపీపీ సుదర్శన్ రెడ్డి, మాజీ ఎంపీపీ రెడ్డియ్యలతో కలిసి శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ లక్కిరెడ్డిపల్లె మండలంలో రూ. 10.16 కోట్ల నిధులతో రహదారుల నిర్మాణాల పనులు ముమ్మరంగా జరుగుతున్నాయన్నారు. రాబోయే రోజుల్లో నిర్మాణాలు చేపట్టి, ప్రజలకు అందుబాటులోకి తెస్తామన్నారు. నియోజకవర్గ అభివృద్ధి అన్ని విధాలా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఏపీఐఐయూడీఈఈ గోపాల్ రెడ్డి, ఏఈఈ సందీప్, ఉపసర్పంచ్ నరేష్, వైఎస్సార్‌సీపీ నాయకులు సిద్దారెడ్డి, రంగారెడ్డి, జై చంద్రారెడ్డి, రమేష్, ధర్మారెడ్డి, శ్రీధర్ రెడ్డి, మల్ రెడ్డి, ఉమా, నంద, కిట్టు, కదిరప్ప, ఓబులేశు తదితరులు పాల్గొన్నారు.

**పింఛన్ల పంపిణీలో పాల్గొన్న ఎమ్మెల్యే**

అవ్వాతాతల ఆనందమే జగనన్న ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. సోమవారం లక్కిరెడ్డిపల్లెలోని ఎంపీడీఓ సభా భవనంలో జరిగిన నూతన పెన్షన్ల పంపిణీలో ఎంపీపీ సుదర్శన్ రెడ్డి, మాజీ ఎంపీపీ రెడ్డయ్యలతో కలిసి ఎమ్మెల్యే పాల్గొన్నారు. వృద్ధులకు న్యాయం చేయాలన్న చిత్తశుద్ధితో పని చేస్తున్నామన్నారు. వారి సంక్షేమానికి ఆహర్నిశలు కృషి చేస్తామని తెలిపారు.

**పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం**

రాయచోటి అర్బన్ : పేదప్రజల సంక్షేమమే జగనన్న ప్రభుత్వం ధ్యేయమని ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మున్సిపల్ కార్యాలయం ఆవరణలో పట్టణ పరిధిలోని నూతనంగా మంజూరైన పెన్షన్ల పంపిణీకి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ చంద్రబాబు హయాంలో రూ.70ల పెన్షన్‌ను 3, 4నెలలకోమారు చెల్లించేవారన్నారు. జగనన్న పాలనలో పెన్షన్‌ను రూ.2750లు చెల్లిస్తున్నారన్నారు. కులం, మతం, పార్టీ, రంగు చూడకుండా ఎవరి సిఫారసు లేకుండా అర్హులందరికి నేరుగా సంక్షేమ పథకాలను అందిస్తున్న ఘనత సీఎం జగనన్నదే అన్నారు. పెన్షన్లను తీసివేస్తున్నట్లు చంద్రబాబు దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. జగనన్న సహకారంతో రాయచోటి జిల్లాకేంద్రంగా మారిందన్నారు. రెండేళ్ళలో రాయచోటి రూపురేఖలు మారుస్తామన్నారు. అన్ని వేళల్లో ప్రజలకు అందుబాటులో ఉంటానంటూ చెప్పారు. పింఛన్ల పంపిణీలో మున్సిపల్ చైర్మన్ ఫయాజ్‌బాషా, మార్కెట్ కమిటీ చైర్మన్ వండాడి వెంకటేశ్వర్లు, మున్సిపల్ వైస్ చైర్మన్ ఫయాజుర్ రహిమాన్, వైఎస్ఆర్‌సీపీ నేతలు హబీబుల్లాఖాన్, బేపారి మహమ్మద్‌ఖాన్‌తోపాటు కౌన్సిలర్లు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ఆటలపోటీలు ప్రతిభను వెలికితీస్తాయి

- క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించిన ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు



విజేతకు బహుమతిని అందజేస్తున్న ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు

రైల్వేకోడూరు : ఆటల పోటీలు క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీస్తాయని ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. సోమవారం మండలంలోని కె.సి.అగ్రహారం సమీపంలో వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, రామిరెడ్డి రాజ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ మొదటిరోజు పోటీలను పార్టీ సీనియర్ నాయకులు కొల్లం గంగిరెడ్డితో కలిసి ప్రారంభించారు. అనంతరం బ్యాట్ పట్టి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా కొరముట్ల మాట్లాడుతూ క్రీడలు మానసిక, శారీరక ఎదుగుదలకు దోహదం చేస్తాయన్నారు. యువత క్రీడల్లో రాణించాలని ఆకాంక్షించారు. గెలుపు ఓటములతో సంభందం లేకుండా స్నేహపూర్వక వాతావరణంలో కొనసాగాలని కోరారు. ప్రతి ఒక్క క్రీడాకారుడు చక్కటి ప్రదర్శన ఇచ్చి గ్రామస్థాయి నుంచి జాతీయ స్థాయికి ఎదగాలని తెలిపారు. ఓడిపోయినా ఓటమి విజయానికి నాందిగా భావించాలన్నారు. అనంతరం మొదటి ఆట విన్నర్స్, రన్నర్స్‌కు అభినందనలు తెలిపి బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి, నాగేశ్వర్‌నాయుడు, జిల్లా టూరిజం డైరెక్టర్ సుధాకర్‌రాజు, జిల్లా కో–ఆప్షన్ సభ్యులు వైఎస్ అన్వర్‌బాషా, తోట శివసాయి, మార్కెట్ కమిటీ చైర్మన్ సుబ్బరామరాజు, వీపీఆర్ కండ్రిగ సొసైటీ చైర్మన్ సుదర్శన్‌రాజు, రమణారెడ్డి, మల్లు క్రిష్ణారెడ్డి, ఆకేపాటి రంగారెడ్డి, ప్రతాప్‌రెడ్డి, రాజేంద్ర, శివయ్య, రాజారెడ్డి, డమ్ము రఘు, బాబు, కన్నా, రవిరెడ్డి, వైఎస్ కరీముల్లా, రౌఫ్, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

## క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



టోర్నీని ప్రారంభిస్తున్న మేడా కృష్ణతేజ రెడ్డి

వీరబల్లి : మండలంలోని సానిపాయి గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకులు సీతారామరాజు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్‌ను రాజంపేట యువనాయకులు మేడా కృష్ణతేజరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా కృష్ణతేజ రెడ్డి మాట్లాడుతూ క్రీడలు యువకుల మానసిక ఉల్లాసానికి, ఆరోగ్యానికి మంచిదన్నారు. ఈ మాదిరెడ్డిగారిపల్లి వైఎస్సార్‌సీపీ నాయకులు సత్యనారాయణ రెడ్డి, రవి, గ్రందేవాండ్లపల్లి రవి, చందు రాజు, నరేష్ స్వామి, బుజ్జి రాజు, సాయి, నవీన్, చిరంజీవి, మధుసూదన్ నాయుడు, శివ కుమార్, క్రీడాకారులు పాల్గొన్నారు.

## పౌష్టికాహారం పంపిణీ

రాయచోటి అర్బన్ : కుష్టు వ్యాధిగ్రస్తులకు సోమవారం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో పౌష్టికాహారం పంపిణీ చేశారు. స్థానిక ప్రభుత్వాసుపత్రిలో కుష్టు చికిత్సా కేంద్రం వద్ద రోటరీ క్లబ్ దత్తత తీసుకున్న 5 మంది రోగులకు రోటరీ క్లబ్ అసిస్టెంట్ గవర్నర్ డాక్టర్ రెడ్డెన్న ఆహారాన్ని అందజేశారు. ప్రస్తుతం పౌష్టికాహారం అందించిన వారికి వరుసగా మరో 5 నెలల పాటు పౌష్టికాహారం అందజేస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ మాజీ కార్యదర్శి నరసింహారెడ్డి, మనోజ్, టీబీ సూపర్‌వైజర్ శ్రీనివాసులు, ల్యాబ్ టెక్నీషియన్ ఉత్తమ్‌రెడ్డి పాల్గొన్నారు.

## రుణాలు మంజూరు చేయాలి

వీరబల్లి : జగనన్న కాలనీల లబ్ధిదారులకు రుణాలు వెంటనే మంజూరు చేయాలని మండల అభివృద్ధి అధికారి ఎం.మధుసూదన్ రెడ్డి కోరారు. సోమవారం స్థానిక వెలుగు కార్యాలయంలో నిర్వహించిన వీఓఏల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇళ్లు మంజూరై కట్టుకోవడానికి ఆర్థిక ఇబ్బందులు ఉన్న వారికి బ్యాంక్ లేదా సమాఖ్యలు ద్వారా రుణాలు ఇవ్వాలన్నారు. సమాఖ్యల సిబ్బంది తమ పరిధిలోని లబ్ధిదారులతో కలిసి వారికి కావాల్సిన ఆర్థిక, ఆర్థికేతర విషయాలపై అవగాహన కల్పించాలన్నారు. హౌసింగ్ ఏఈ వెంకటేష్ మాట్లాడుతూ అర్హులందరికీ ఇళ్లు కల్పించే బాధ్యత వీఓఏ సిబ్బంది తీసుకోవాలని, ఇల్లు నిర్మించుకునే వారికి ఆర్థిక చేయూత కల్పించడం వలన లక్ష్యం నెరవేరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం ఖాదర్ వలీ, స్త్రీనిధి మేనేజర్లు రెడ్డయ్య, సుధీర్, సమాఖ్య అధ్యక్షురాలు జమీల, సమాఖ్య సిబ్బంది పాల్గొన్నారు.

## పారిశుధ్యం, వీధిలైట్ల ఏర్పాటు

పుల్లంపేట : సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని పుల్లంపేటలో సర్పంచ్ ఆకేపాటి శ్రీనివాసులు రెడ్డి ఆధ్వర్యంలో పారిశుధ్య పనులు, వీధి దీపాలకు మరమ్మతు చేపట్టారు. అలాగే నూతన ఎల్‌ఈడీ బల్బులను ఏర్పాటు చేయడంతో పుల్లంపేట కొత్త హంగులతో దర్శనమిచ్చింది. దీంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు.

## గోల్డ్ మెడల్ సాధించిన రైల్వేకోడూరు విద్యార్థి

రైల్వేకోడూరు : కర్ణాటక రాష్ట్రం బెంగుళూరులో గత నెల 28 నుంచి 30వ తేదీ వరకు నిర్వహించిన ఏటీటీ కప్ ఓపెన్ ఇంటర్నేషనల్ తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీల్లో రైల్వేకోడూరులోని ఆంధ్ర పబ్లిక్ స్కూల్ విద్యార్థి కటారు నిఖిల్‌కుమార్ అండర్–15 విభాగంలో గోల్డ్ మెడల్ సాధించినట్టు సోమవారం ఆ స్కూల్ కరస్పాండెంట్ కటారు శ్రీధర్ తెలిపారు. అనంతరం విద్యార్థిని స్కూల్ యాజమాన్యం అభినందించారు.

# హైడ్రో ప్రాజెక్ట్‌ను నిర్మించవద్దు

- కలెక్టర్‌కు మాండవ్య నదీ పరివాహక ప్రాంతవాసుల వినతి



కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న నదీ పరివాహక గ్రామస్తులు

రాయచోటి అర్బన్ : వీరబల్లి మండలంలో మాండవ్యనది పరివాహక ప్రాంతమైన కల్లేవాండ్లపల్లె వద్ద హైడ్రో పవర్ ప్రాజెక్టు నిర్మించవద్దంటూ నదీ పరివాహక గ్రామాల ప్రజలు కలెక్టర్ గిరీషా పీఎస్‌కు విన్నవించారు. సోమవారం నదీ పరివాహక గ్రామాలైన గడికోట, వీరబల్లి, దిగువరాచపల్లెల ప్రజలు కలెక్టరేట్‌లో నిర్వహిస్తున్న స్పందనకు హాజరై కలెక్టర్ దృష్టికి సమస్యను తీసుకువచ్చారు. వారు మాట్లాడుతూ వీరబల్లి మండలంలోని కల్లేవాండ్లపల్లె వద్ద మాండవ్య నదిలో 1.17 టీఎంసీల నీటితో లోయర్ రిజర్వాయర్‌ను నిర్మించి హైడ్రో పవర్ ప్రాజెక్టును నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ప్రాజెక్టు నిర్మాణం వలన వ్యవసాయ భూములకు నీటి కొరత ఏర్పడుతుందన్నారు. ప్రాజెక్టు నిర్మాణం కోసం ప్రభుత్వం సారవంతమైన వ్యవసాయ భూములను సేకరించేందుకు సిద్ధపడుతోందన్నారు. తమ భూములను ప్రాజెక్టు కోసం సేకరిస్తే తామంతా జీవనభృతిని కోల్పోతామంటూ కలెక్టర్ ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. ఎట్టిపరిస్థితుల్లో మాండవ్యనదిపై కల్లేవాండ్లపల్లె వద్ద హైడ్రోపవర్ ప్రాజెక్టును నిర్మించవద్దంటూ వేడుకున్నారు. అనంతరం ఈమేరకు వినతిపత్రాన్ని కలెక్టర్‌కు అందజేశారు. రైతులతో పాటు ఓపీడీఆర్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈశ్వర్, ఏపీ వడ్డెర విద్యావంతుల వేదిక నేతలు మారుతి, చల్లా రెడ్డెయ్య, సీపీఐ నేత శ్రీనివాసులు, టీడీపీ నేత భానుగోపాల్ రాజు, ఏఐవైఎఫ్ నేత వెంకటేష్ పాల్గొన్నారు.

# పల్లకీలో ఊరేగిన భద్రకాళీ సమేతుడు



పల్లకీలో ఊరేగుతున్న భద్రకాళీ సమేతుడు

రాయచోటి టౌన్ : భద్రకాళీ సమేత వీరభద్రస్వామి పల్లకీలో ఊరేగారు. సోమవారం రాత్రి స్వామివారికి, అమ్మవారికి అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఉత్సవమూర్తులకు రంగురంగుల పూలు, పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలతో అందంగా అలంకరించి పల్లకీలో ఉంచి ఆలయ ఆవరణలో ఊరేగించారు. పల్లకీ సేవలో ఆలయ పాలకమండలి అధ్యక్షురాలు పి.విజయ, ఆలయ ఈఓ డివి రమణారెడ్డి, అర్చకులు పాల్గొన్నారు.

# ప్రజాసంకల్పయాత్రతో ప్రజల కష్టాలు గుర్తింపు

- జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి



కేక్ కట్ చేస్తున్న జెడ్పీ చైర్మన్ అమర్‌నాథరెడ్డి, మండల నాయకులు తదితరులు

రాజంపేట రూరల్ : గతంలో ప్రతిపక్ష నేతగా ఉన్న ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన ప్రజాసంకల్పయాత్ర ప్రజల కష్టాలను గుర్తించేందుకు దోహద పడిందని జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి అభిప్రాయపడ్డారు. మండల పరిధిలోని ఆకేపాటి ఎస్టేట్‌లో వైఎస్ జగన్ చేపట్టిన ప్రజా సంకల్పయాత్ర 4సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా జెడ్పీ చైర్మన్ ఆకేపాటి ఆధ్వర్యంలో వేడుకలను నిర్వహించారు. కేక్ కట్ చేశారు. అనంతరం బాణసంచా కాల్చారు. 'జోహార్ వైఎస్సార్.. జై జగనన్న' అంటూ నినదించారు. ఈ సందర్భంగా ఆకేపాటి మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధి కోసం జగన్ మోహన్‌రెడ్డి తిరిగి ముఖ్యమంత్రి కావాలని ప్రతి ఒక్కరూ కోరుకుంటున్నారని తెలియజేశారు. ప్రతిపక్షాలు జగన్‌ను ఎదుర్కొనే దమ్ములేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పోలి మురళీరెడ్డి, ఏ.సౌమిత్రి, పి. శంకరశెట్టి, కె. శ్రీహరిబాబు, చంద్రశేఖర్‌రెడ్డి, ఎల్లారెడ్డితో పాటు మహిళలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సంక్షేమం ప్రతి తలుపు తడుతోంది

- పథకాలపై జనంలో సంతృప్తి
- గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి



సంక్షేమ బావుటాను అందజేస్తున్న ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి

నందలూరు(రాజంపేట) : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అర్హతే ప్రామాణికంగా సంక్షేమం ప్రతి ఇంటి తలుపుతడుతోందని రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి అన్నారు. సోమవారం నందలూరు మండలంలోని నల్లతిమ్మాయపల్లెలో గడప గడపకు మన ప్రభుత్వాన్ని ఎంపీపీ మేడా విజయభాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి నాలుగేళ్ల కాలంలో చేసిన సంక్షేమం, అభివృద్ధిని వివరించారు. ఏవైన సమస్యలు ఉన్నాయో అని అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేశారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధి ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రజలుకు మేలు చేస్తుంటే ప్రతిపక్షం టీడీపీ ఓర్వలేక కుట్రరాజకీయాలు చేస్తోందని ఎమ్మెల్యే మండిపడ్డారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చిన యేడాది వ్యవధిలోనే 95 శాతానికి పైగా ముఖ్యమంత్రి జగనన్న అమలు చేశారని గుర్తుచేశారు. ఎంపీపీ మాట్లాడుతూ ఏ పథకమైనా ప్రకటించిన తేదీల్లోనే లబ్ధిదారులకు అందజేస్తూ పారదర్శక పాలన సాగిస్తున్నారన్నారు. అటువంటి ముఖ్యమంత్రికి రానున్న కాలంలో ప్రజల ఆశీర్వాదాలు ఉండాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ గడికోట ఉషాసుబ్బారెడ్డి, సర్పంచి శీరీషానరసింహారెడ్డి, ఎంపీటీసీ పణతల రాజేశ్వరీ, ముదిరాజ్ కార్పొరేషన్ స్టేట్ డైరక్టర్ లక్ష్మినరసయ్య, సింగల్‌విండో అధ్యక్షుడు పాలగిరి సుధాకర్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పాలగిరి మల్లికార్జునరెడ్డి, మోదుగల చంద్ర, గొబ్బిళ్ల త్రినాథ్, పణతల రామచంద్ర, ఈశ్వరయ్య, నరసారెడ్డి, అన్నం నాగేంద్ర, ఆర్ముగం విశ్వనాథ్, బొక్కే రమణ, కాకిచంద్ర, ఎంపీడీఓ సౌభాగ్య, ఎస్ఐ మైనుద్దీన్ పాల్గొన్నారు.

# రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలి

- విభజన హామీలను కేంద్రం వెంటనే అమలు చేయాలి
- రౌండ్ టేబుల్ సమావేశంలో పలు విద్యార్థి సంఘాల నేతలు



మాట్లాడుతున్న శివారెడ్డి

రాయచోటి అర్బన్ : కేంద్రప్రభుత్వం వెంటనే ఏపీకి ప్రత్యేక హోదాను ప్రకటించాలని పలు విద్యార్థి సంఘాల నేతలు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ఎన్జీఓ సభా భవనంలో ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, పీడీఎస్‌యూ, డీవైఎఫ్ఐ, ఏఐవైఎఫ్, ఎంఎస్ఎఫ్‌ల ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. పాల్గొన్న పలువురు విద్యార్థి నాయకులు మాట్లాడుతూ విభజన చట్టంలోని హామీలను వెంటనే అమలు చేయాలని, పోలవరం ప్రాజెక్టుకు త్వరగా పూర్తి చేయించాలంటూ కోరారు. ఎంతో వెనుకబడిన రాయలసీమతో పాటు ఉత్తరాంధ్ర జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీని ప్రకటించాలంటూ డిమాండ్ చేశారు. విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో ఈనెల 20వ తేదీ నుంచి సత్యసాయి జిల్లా హిందూపురం నుంచి ఫిబ్రవరి 4వ తేదీ వరకు శ్రీకాకుళం వరకు బస్సుయాత్ర చేపట్టనున్నట్లు తెలియజేశారు. బస్సు యాత్రకు విద్యార్థులు, యువకులు, మేధావులు పెద్దఎత్తున హాజరై విజయవంతం చేయాలన్నారు. సమావేశానికి ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శులు కోటేశ్వరరావు, నరసింహాలు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివారెడ్డి, ఏఐటీయూసీ జిల్లా గౌరవ అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శులు సిద్దిగాళ్ళ శ్రీనివాసులు, సాంబశివ, ఏపీ గిరిజన సమాఖ్య జిల్లా అధ్యక్షుడు విశ్వనాథ నాయక్, ఏఐవైఎఫ్ జక్కల వెంకటేష్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు లవకుమార్, పీడీఎస్‌యూ జోగేశ్వర్, ఎంఎస్ఎఫ్ నేతలు శివతేజ, రామాంజి, సీపీఐ నేత పుల్లయ్యతో పాటు విద్యార్థిసంఘాల నేతలు పాల్గొన్నారు.

# రీజనల్ క్రీడల్లో విద్యార్థుల ప్రతిభ



క్రీడల్లో ప్రతిభచాటిన విద్యార్థులతో అధ్యాపకులు

ఓబులవారిపల్లె : రీజనల్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్–2022 క్రీడా పోటీలలో పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎల్.కృష్ణసాయి తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాలలో క్రీడల్లో రాణించిన విద్యార్థులకు కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఈనెల 6, 7వ తేదీల్లో ప్రొద్దుటూరులో నిర్వహించిన క్రీడా పోటీలలో కళాశాలకు చెందిన కంప్యూటర్ మొదటి సంవత్సరం చదువుతున్న ఎం.రాజశేఖర్ లాంగ్ జంప్‌లో ద్వితీయ స్థానం, ఈసీఈ విభాగంలో మొదటి సంవత్సరం చదువుతున్న ఎం.హేమంత్ కుమార్ రెడ్డి షాట్‌పుట్‌లో ద్వితీయ బహుమతి సాధించారన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు సి.దేవరాజ్, టి.లలిత, ఇన్‌చార్జ్ పీడీ ఏ.ప్రవీణ్ కుమార్, విద్యార్థులు అభినందించారు.

# పనితీరు మరింత మెరుగుపడాలి

- సచివాలయం సిబ్బందికి డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారి నరసింహమూర్తి సూచన



రికార్డులను తనిఖీ చేస్తున్న డీఎల్‌డీఓ నరసింహమూర్తి

రాజంపేట టౌన్ : మున్సిపాలిటీ పరిధిలోని కొన్ని సచివాలయాల్లో సిబ్బంది పనితీరు మరింత మెరుగుపడాల్సి ఉందని డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారి (డీఎల్‌డీఓ) నరసింహమూర్తి తెలిపారు. పట్టణంలోని బలిజపల్లె, సరస్వతీపురం సచివాలయాలను సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించి, అక్కడి సిబ్బంది పనితీరును తెలుసుకున్నారు. ప్రభుత్వ పథకాల అమలుకు సంబంధించి వారికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. సోమ, బుధ, శుక్రవారాల్లో అన్ని విభాగాల సిబ్బంది వలంటీర్లను సమావేశపరచి ప్రజలకు ప్రభుత్వ పథకాలు ఎలా అందుతున్నాయి, అలాగే ప్రజల నుంచి ఏయే వినతులు వచ్చాయి అన్న విషయాలను సమీక్షించాలని ఆదేశించారు. ప్రతి రోజు మధ్యాహ్నం 3 గంటల నుంచి 5 వరకు విధిగా స్పందన కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. వచ్చిన ఫిర్యాదులను పరిష్కరించాలన్నారు. వార్డు, గ్రామ సచివాలయాలు సెక్రటేరియేట్‌తో సమానమన్నారు. సమస్యలు పరిష్కరించి ప్రజలకు వారికి అవసరమైన సేవలందించినప్పుడే సీఎం ఆశయం నెరవేరగలదని తెలిపారు. ఉగాదికి నాటికి జగనన్న కాలనీలో చేపడుతున్న ఇంటి నిర్మాణాలను పూర్తి చేసి గృహ ప్రవేశాలను చేయాలని లబ్ధిదారులకు తెలియజేశారు.

# కాన్పులు ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే సురక్షితం



గర్భిణులకు పరీక్షలు చేస్తున్న డా.రాధామాధవి

గాలివీడు : తల్లీబిడ్డ క్షేమంగా ఉండేందుకు ప్రభుత్వ ఆస్పత్రులలో మెరుగైన వైద్యం అందించడంతో పాటు సురక్షిత కాన్పులను చేస్తున్నట్లు మండల వైద్యాధికారిణి డాక్టర్ రాధా మాధవి తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణులకు వైద్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రధాన మంత్రి మాతృత్వ సురక్ష అభియాన్ కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు పరీక్షలు నిర్వహించి మందులను ఉచితంగా అందజేశామన్నారు. పౌష్టికాహారం తీసుకుంటే రక్తహీనతను అధికమించవచ్చని సూచించారు. ప్రతి గర్భిణీ క్రమం తప్పకుండా పరీక్షలు చేయించుకోవాలని కోరారు. పుట్టిన బిడ్డకు ముర్రుపాలు పట్టించాలని, శిశువులకు వ్యాధి నిరోధక టీకాలు తప్పక వేయించాలన్నారు. అలాగే ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు.

# సందడిగా ముందస్తు సంక్రాంతి వేడుక



భోగి మంటలు వేసి గొబ్బిళ్లు ఆడుతున్న విద్యార్థినులు

రాయచోటి టౌన్ : ముందస్తు సంక్రాంతి వేడుకలలో భాగంగా రాయచోటి పట్టణంలోని శ్రీ షిరిడీసాయి మహిళా కళాశాల ఆవరణలో నిర్వహించారు. సోమవారం కళాశాలలో వేడుకలు నిర్వహణలో భాగంగా విద్యార్థినులు సంప్రదాయ దుస్తులు హాజరయ్యారు. అలాగే రంగులతో ముగ్గులతో భోగి మంటలు వేసి గొబ్బిళ్ల పెట్టారు. తరువాత పలు రకాల సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ వెంకటచలమారెడ్డి మాట్లాడుతూ అంతరించిపోతున్న మన సంప్రదాయాలను తిరిగి జీవం పోసుకోవాలంటే మన పిల్లలకు వీటిని నేర్పాలని చెప్పారు. ముగ్గుల పోటీలలో గెలుపొందిన విద్యార్థినులకు బహుమతులు అందజేశారు.